క్లుప్తంగా

దీక్షా మందిరానికి శంకుస్థాపన



కృత్తివెన్ను: అయ్యప్పస్వామి వారి దేవస్థానం నూతన దీక్షా మందిరం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరిగింది. సీతనపల్లి స్లోపు వద్ద స్వామివారి ఆలయంలో దాతల విరాళాలు సుమారు రూ. 25 లక్షల అంచనాలతో ఈ మందిర నిర్మాణం జరుగుతోందని ఆలయ చైర్మన్ కె. నాగబాబు తెలిపారు. ప్రత్యేక పూజలతో మందిరం పనులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు లంక మండల పరిషత్ సమావేశం

నాగాయలంక: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే సమావేశంలో 21 శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందని, సంబంధిత మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

భక్తితో చండీహోమం



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని ఆదిలక్ష్మీదేవి నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో భాగంగా ఆదివారం చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత నిత్యపూజలు, దీక్షా హోమాలు, అమ్మవారి విగ్రహానికి మహాభిషేకం, జలాదివాసములు జరిగాయి. చండీహోమం, అమ్మవారి విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం ధాన్య, పుష్ప, శయ్య, వస్త్రాదివాసములు, చతుర్వేద స్వస్తి జరిపారు. సోమవారం ఉదయం 10.36 గంటలకు ఆదిలక్ష్మి నూతన శిల విగ్రహ ప్రతిష్ఠ, యంత్రస్థాపన, అనంతరం మహా అన్నప్రసాద వితరణ జరుగుతుందని నిర్వాహక కమిటీ వర్గాలు తెలిపాయి.

నగరంలో 96.56 శాతం పింఛన్ల పంపిణీ



మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ మూడో రోజైన ఆదివారం కొనసాగింది. నగరంలో 18,669 పింఛన్లు ఉండగా వీటిలో 18,026 పింఛన్లను పంపిణీ చేసి 96.56 శాతం సాధించారు. ఇంకా 643 పింఛన్లు పంపిణీ చేస్తే నూరుశాతం పింఛన్ల పంపిణీ పూర్తికానుంది. రానున్న రెండు రోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తవుతుందని కమిషనర్ జి. చంద్రయ్య తెలిపారు.

ఈ-చలానాలపై స్పెషల్ డ్రైవ్



కోడూరు: వాహనాలపై పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలను కట్టించేందుకు పోలీసులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో ఎస్‌ఐ వి.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. వాహనాలపై గతంలో ఉన్న పెండింగ్ చలానాలను పరిశీలించి వాటిని ఆన్‌లైన్ ద్వారా కట్టించారు. వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ సూచించారు.

నూకాలమ్మ సంబరాలు



రావివారిపాలెం(మోపిదేవి): ఐదు రోజులుగా కొనసాగుతున్న గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారి సంబరాలు ఆదివారంతో ముగిశాయి. రావివారిపాలెంలోని నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించారు. మొదటి మూడు రోజులు ఘటం కుండ ఇంటింటా మేళతాళాలు, డప్పుకళాకారుల సందడితో పూజలు అందుకోగా, చివరి రెండు రోజులైన శని, ఆదివారం అమ్మవారి గుడి సంబరంతో జాతర ముగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నైవేద్యాలు, మొక్కుబడులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి చెల్లించుకున్నారు.

సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడులు

- తెగుళ్లను గుర్తించడంలో జాగ్రత్తలు అవసరం
- సకాలంలో నివారణ చర్యలతో మంచి ఫలితాలు
- తీరంలో కొబ్బరి సాగుది తృతీయ స్థానం



చినగొల్లపాలెంలో కొబ్బరితోట


కృత్తివెన్ను: తీర ప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో వ్యవసాయం, ఆక్వా రంగం తరువాతి స్థానం కొబ్బరిదే. సాగునీటి సౌలభ్యం లేని చినగొల్లపాలెం దీవిలో కొబ్బరే ప్రధాన పంట. దీవితో పాటు మండల వ్యాప్తంగా సుమారు ఆరు నుంచి ఎనిమిది వేల ఎకరాల్లో కొబ్బరి సాగవుతున్నట్లు అంచనా. కొబ్బరి తోటల సాగులో సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చు. తెగుళ్లు, చీడపీడలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. అప్పుడే అధిక దిగుబడులతో రైతులు లాభాల బాట పడతారని ఉద్యాన శాఖాధికారి మానస అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో కొబ్బరి సాగులో రైతులు పాటించాల్సిన పద్ధతులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె పలు సూచనలు, సలహాలు అందించారు.

మచ్చ తెగులు నివారణ ఇలా..

కొబ్బరిలో కాయపై మచ్చతెగులు కనిపిస్తోంది. దీని నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. మోనోక్రొటోఫాస్ 10 ఎంఎల్, 10 ఎంఎల్ నీటిలో కలిపి చెట్టు మొదలు నుండి 4-5 అడుగుల దూరంలో చెట్టు ఆరోగ్యవంతమైన వేరును (ముదురు వర్ణం కలిగిన వేరు) తీసుకుని దాని చివర భాగాన్ని కత్తిరించి ద్రావణం నింపిన పాలిథిన్ సంచిలో 24 గంటల పాటు ఉంచాలి. ఈ విధానాన్ని సాధ్యమైనంత వరకు రైతులంతా సామూహికంగా చేపడితే మంచి ఫలితాలు వస్తాయి.

మాడు తెగులు నివారణకు ...

యూరియా, సూపర్, పొటాష్‌ల మిశ్రమాన్ని చెట్టు మొదట్లో వేసుకోవాలి. ఇవి వేసిన 20 నుండి నెల రోజుల తరువాత మెగ్నీషియం సల్ఫేట్‌ను ఒక్కొక్క చెట్టుకు 500 గ్రాముల వంతున వేయాల్సి ఉంటుంది. ఇది చెట్టు ఆకుల వృద్ధికి సహకరిస్తుంది. చెట్టుకు మట్టలు ఎక్కువగా ఉంటే అధికంగా గెలలు వేసేందుకు దోహదపడతాయి. అందుకోసం సంవత్సరానికి ఒకసారి చెట్టు మొదలుకు 3-4 అడుగుల దూరంలో చిన్నపాటి గుంతలు తవ్వి 100 గ్రాముల బోరాన్ వేసుకోవడం ఉత్తమం.



తెగులు సోకడంతో మాడిపోయిన కొబ్బరి ఆకులు

వేరు పురుగు నివారణకు...

తీరప్రాంతం కావడంతో ఇసుక నేలలు అధికంగా ఉంటాయి. ఇలాంటి చోట వేరు పురుగు ఆశించే ప్రమాదం ఉంది. దీని నివారణకు ఐదు కిలోల వేప పిండిని తగినంత పశువుల ఎరువులో కలిపి చెట్టు మొదలు నుండి 3-4 అడుగుల దూరంలో గుంత తవ్వి వేసుకోవాలి.



కొమ్ము పురుగు వల్ల దెబ్బతిన్న కొబ్బరిచెట్టు

కొమ్ము పురుగు నివారణకు...

కొబ్బరిలో కొమ్ము పురుగు వల్ల తీవ్ర నష్టం జరుగుతుంది. దీనినే మొవ్వ కొట్టు పురుగు అని కూడా అంటారు. ఇది చెట్టు మొవ్వ భాగంలో చేరి మొవ్వను నాశనం చేస్తుంది. దీని నివారణకు కార్బోసిరాన్ 3జి గుళికలు 5 గ్రాములు, 5 గ్రాముల ఇసుకలో కలిపి పలుచటి వస్త్రంలో ఈ మిశ్రమాన్ని మూటకట్టి చెట్టు మొవ్వులో పెట్టాలి. ఇలాంటి సస్యరక్షణ చర్యల ద్వారా కొబ్బరిని లాభసాటి సాగుగా చేసుకోవచ్చు.

మృతుడి కుటుంబానికి రూ. లక్ష సాయం



కోడూరు: పంటపొలం వద్ద విద్యుత్ మరమ్మతులు చేస్తున్న లైన్‌మెన్ ప్రమాదవశాత్తు మృతిచెందడంతో మృతుడి కుటుంబానికి పొలం రైతు రూ.లక్ష నగదును అందించారు. మండలంలోని ఉల్లిపాలెం గ్రామానికి చెందిన పెద్ది క్రాంతికుమార్ నాగాయలంకలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా క్రాంతికుమార్ ఇటీవల ఏటిమొగ గ్రామంలో రైతు విశ్వనాథపల్లి నారాయణరావు పొలం వద్ద విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. తన పొలం వద్ద క్రాంతికుమార్ పనిచేస్తుండగా మరణించడంతో రైతు నారాయణరావు మృతుడి కుటుంబానికి రూ.లక్ష నగదును విద్యుత్ శాఖ ఏడీఏ సుబ్రహ్మణ్యేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. ఉల్లిపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల వితరణ



కోనేరుసెంటర్: ఎస్ఎన్ గొల్లపాలెంకు చెందిన దివ్యాంగ పింఛనుదారు కొల్లు శేషసాయమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. గ్రామంలోని తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ.100 చొప్పున సేకరించిన రూ. 30,200 లను మృతురాలి భర్త కొల్లు పెద నాగేశ్వరరావుకు ఆదివారం అందజేశారు. మాజీ సర్పంచ్ మట్టా మోహన్ నాంచారయ్య, సచివాలయ కన్వీనర్లు గణేశన వెంకటేశ్వరరావు, గణేశన రమేష్, గృహ సారథులు బీమా శ్రీనివాసరావు, కొల్లు వరలక్ష్మి, మట్టా ఈశ్వరరావు, పెన్షన్ దారులు చిలంకుర్తి నాంచారయ్య, కనుమూరి సీతారామయ్య, బొమ్మదేవర పిచ్చియ్య పాల్గొన్నారు.

చల్లపల్లిలో అరుదైన శస్త్రచికిత్స

గర్భసంచి నుంచి నాలుగు కిలోల కణితి తొలగింపు





ఆదిలక్ష్మితో డాక్టర్ నల్లపనేని కీర్తి బృందం (ఇన్‌సెట్) నాలుగు కిలోల కణితి

చల్లపల్లి: గర్భసంచి ముఖద్వారంలో పెరిగిన భారీ సైజు కలిగిన నాలుగు కిలోల కణితిని చల్లపల్లికి చెందిన వైద్యులు విజయవంతంగా తొలగించారు. అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన పట్బూరి ఆదిలక్ష్మికి కడుపులో కణితి ఉందని కుటుంబ సభ్యులు చల్లపల్లిలోని కీర్తి హాస్పిటల్‌లో చేర్చారు. స్కానింగ్ చేయగా గర్భ సంచి ముఖద్వారంలో దాదాపు నాలుగు కిలోల బరువైన కణితి (ఫైబ్రాయిడ్)గా గుర్తించారు. దాదాపు ఆమె కడుపు తొమ్మిది నెలల గర్భిణీలా మారిపోయింది. ఆమెకు ఆగస్టు 30న డాక్టర్ నల్లపనేని కీర్తి, డాక్టర్ కేశవకృష్ణ, డాక్టర్ సబ్బినేని భవానీ ప్రసాద్, మత్తు డాక్టర్ కృష్ణ సమిష్టి కృషితో నాలుగు కేజీల బరువైన కణితిని గర్భసంచితో పాటు విజయవంతంగా తొలగించారు. కోలుకున్న అనంతరం పేషెంట్‌ను ఆదివారం డిశ్చార్జ్ చేశారు.

కోలాహలంగా అంకాల దేవర సంబరం

నాగాయలంక: స్థానిక తూర్పు బజారు రజక పేటలోని అంకాల దేవర అమ్మవారి దేవస్థానంలో వార్షిక జాతర (సంబరం) మహోత్సవం ఆదివారం కోలాహలంగా జరిగింది. తొలుత అమ్మవారి ఘటాలను కృష్ణానదికి తీసుకువెళ్లి జాతర సంప్రదాయాలకు అనుగుణంగా రజక పూజారులు శుద్ధిచేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఘటాలను పూజారులు తలపై ధరించి డప్పు నృత్యాలు, మేళతాళాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా గుడికి చేరుకున్నారు. ఆచారవంతులచే సంప్రదాయక గుడిజాతర, భక్తుల మొక్కుబడులు, నైవేద్యం సమర్పణ, జాతర నృత్యాలు జరిగాయి. నిర్వాహక కమిటీ ప్రతినిధులు పోతార్లంక కొండలు, ప్రవీణ్, నాగాయలంక అజ్జుబాబు, పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గన్నవరం: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో గన్నవరం ప్రాంత విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పాడ చంద్రశేఖర్‌రావు తెలిపారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిప్పాడ మాట్లాడుతూ... ఇటీవల విశాఖపట్నంలో కరాటే ఇండియన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో అండర్-14 విభాగంలో గన్నవరానికి చెందిన మాన్య బంగారు పతకాన్ని, సీహెచ్. శ్రావణి రజిత పతకాన్ని సాధించినట్లు తెలిపారు. అండర్-14 బ్లాక్ బెల్ట్‌ను బొమ్మరెడ్డి జయంత్ కైవసం చేసుకున్నట్లు వివరించారు. వీరందరూ ఈ నెల 9, 10 తేదీల్లో కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ యు.వెంకట్రామ్‌ను అసోసియేషన్ సభ్యులు అభినందించారు. కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు, ప్రజ్ఞా స్కూల్ డైరెక్టర్ చెన్నారావు, రిటైర్డ్ ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బందరులో వైభవంగా గంగానమ్మ సంబరం

మచిలీపట్నంటౌన్: స్థానిక ప్రభుత్వాస్పత్రి రోడ్డులోని గంగానమ్మ తల్లి సంబరం మూడో రోజైన ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి భక్తులు వేడి నైవేద్యాలు సమర్పించారు. డప్పు వాయిద్యాల నడుమ పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయం ఎదుట వేసిన అమ్మవారి ముగ్గు వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంయూడీఏ చైర్మన్ బొర్రా దుర్గాభవానీ, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కృత్తివెన్ను: కోడిపందేల శిబిరంపై దాడి చేసిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. కృత్తివెన్ను ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చినపాండ్రాక పంచాయతీ రామాపురంలో ఆదివారం కోడిపందేలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఐ తన బృందంతో పందేల శిబిరంపై దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 1,050 నగదు, ఒక పందెం పుంజును స్వాధీనం చేసుకున్నారు.

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం కొడాలిలో పేకాట శిబిరంపై ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,220 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వస్త్ర వ్యాపారిపై లారీ డ్రైవర్ దాడి

కోనేరుసెంటర్: వస్త్ర వ్యాపారిపై లారీ డ్రైవర్ దాడి చేశాడు. చిలకలపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ ఫైజల్ కొంత కాలంగా మాచవరం మెట్టు సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో బట్టలు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. లీలా అనే లారీ డ్రైవర్ శనివారం సాయంత్రం తన లారీని అక్కడ పార్కింగ్ చేసుకునేందుకు బట్టలు అమ్ముకునే ప్రదేశాన్ని మార్చుకోవాలని చెప్పాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. లీలా రాడ్డు తీసుకుని ఫైజల్ తలపై బలంగా కొట్టాడు. గాయపడిన ఫైజల్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాజానికి ఉన్నత సేవలు అందించాలి

పెనమలూరు: సత్యసాయి సేవాదళ సభ్యులు సమాజానికి ఉన్నత సేవలు అందించి మార్గదర్శకులుగా నిలవాలని సత్యసాయి సేవాసమితి కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ అన్నారు. పెనమలూరు శ్రీ భగవాన్ సాయి మందిరంలో ఆదివారం సత్యసాయి సేవాదళ సభ్యుల శిక్షణ నిర్వహించారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, గన్నవరం, హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంతాల నుంచి సత్యసాయి అనుబంధ భజన మండలి సభ్యులు, కన్వీనర్లు, సమన్వయకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమరగిరి చంద్రశేఖర్ మాట్లాడుతూ సేవాదళ సభ్యులు సేవపై ఆంతర్యం తెలుసుకోవాలని సూచించారు. సమాజానికి విశిష్టమైన సేవలు అందించి మార్గదర్శకులుగా నిలవాని కోరారు. సభ్యులు ఆధ్యాత్మిక విలువలు, మానవ సంబంధాలు, విలువలతో కూడిన సేవల పై ఆయన వివరించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్, ఆధ్యాత్మిక సమన్వయ కర్త అడపా భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర

బంటుమిల్లి: స్థానికంగా కొలువైన గంగానమ్మ నెల్లూలమ్మ జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి వేడి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గంగానమ్మ, పోతురాజు ఘటాలను ప్రత్యేక స్థలాల్లో ఏర్పాటు చేసిన కుటీరాలలో ప్రవేశపెట్టి ఆరు రోజులుగా ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. బంధువులు, తోబుట్టువులు, కుటుంబ సభ్యుల రాకతో బంటుమిల్లిలో పండుగ వాతావరణం నెలకొన్నాయి.

ముస్లిం మైనార్టీల పక్షపాతి జగన్



ఆకులమన్నాడులో కరపత్రాలు అందజేస్తున్న అయూబ్‌ఖాన్ తదితరులు

గూడూరు: ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం కృష్ణా జిల్లా అధ్యక్షుడు అయుబ్ ఖాన్ అన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాద్ కార్యక్రమంలో భాగంగా గూడూరు మండలంలోని ఆకులమన్నాడు, గూడూరు గ్రామాల్లోని మసీదులు, దర్గాల వద్ద కమిటీ ప్రతినిధులతో అయూబ్‌ఖాన్ ఆదివారం సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్లకు రూ.5 వేలు వేతనాలు ఇస్తున్నారన్నారు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు రూ.80 వేల చొప్పున చేయూత అందించారని వివరించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ముస్లింలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. పెడన ఎమ్మెల్యేగా తిరిగి జోగి రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మైనార్టీ నాయకులు షేక్ ఫైజుల్ రహమాన్, పెడన పట్టణ సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్, సీహెచ్‌సీ డైరెక్టర్ ఎంఏ సలీం, దర్గా కమిటీ చైర్మన్ ఎండీ ఆసీస్, షేక్ నూరుద్దీన్, రియాజుల్ రెహమాన్, మొహమ్మద్ అమీర్, షేక్ దాదా యూనుస్, ముజీబ్, సమద్ గఫార్ పాల్గొన్నారు.

బ్యాంకు ప్రసాద్‌గా గుర్తింపు పొందడం అభినందనీయం

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ప్రముఖులు

మోపిదేవి: బ్యాంకులో ఉద్యోగం చేస్తూ బ్యాంకు పేరునే ఇంటి పేరుగా గుర్తింపు పొందిన రాజులపాటి ప్రసాద్ అభినందనీయుడని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. ఎస్‌బీఐ క్యాషియర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ప్రసాద్ దంపతుల సన్మాన కార్యక్రమం స్థానిక హోటల్‌లో ఆదివారం జరిగింది. ఉప్పాల హారిక మాట్లాడుతూ ప్రసాద్ 35 ఏళ్లు బ్యాంక్ క్యాషియర్‌గా అమూల్యమైన సేవలు అందించారని కొనియాడారు. ప్రసాద్‌కు హైదరాబాద్ సీఎస్‌బీ అకాడమీ సంస్థ డైరెక్టర్ మల్లవరపు బాలలత బంగారు ఉంగరం అందించి, పూలమాలలు, శాలువాతో సన్మానించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తనయుడు వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్‌బాబు, చల్లపల్లి జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, అవనిగడ్డ జెడ్పీటీసీ లక్ష్మీనారాయణ, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, రాష్ట్ర బీసీ నాయకులు కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య), బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, బీసీ రాష్ట్ర నాయకులు శొంఠి నాగరాజు, డీఐజీ రిజిస్ట్రేషన్ బి. శివరాం, ప్రగతి విద్యా సంస్థల డైరెక్టర్ పూర్ణచంద్రరావు, న్యాయవాది సనకా రఘురాం పాల్గొన్నారు.

సుదర్శి మానవతా సేవా సంస్థ సేవలకు ప్రశంస



అవార్డు అందుకుంటున్న రఘుశేఖర్, వెంకట నారాయణ

నాగాయలంక: సుదర్శి మానవతా సేవా సంస్థ సామాజిక సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. సామాజిక సేవలో భాగంగా ఇప్పటి వరకు 184 జతల కళ్లను దానం చేయించడంలో సఫలీకృతులైన సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణకు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ నుంచి మోటివేషన్ ప్రశంసా అవార్డు లభించింది. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా విజయవాడ కోడే వెంకటాద్రి చౌదరి క్యాంపస్‌లో శనివారం రాత్రి జరిగిన వేడుకల్లో వీరిని సన్మానించి అవార్డును, మెమెంటోను అందజేశారు. మెడికల్ హెడ్ డాక్టర్ ససనువ కపూర్, ఐ బ్యాంక్ డైరెక్టర్ డాక్టర్ అరవింద్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో నిరుద్యోగ సమస్య

గుడివాడటౌన్: కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ విధానంతో దేశానికి ఈ దుస్థితి దాపురించిందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే విధానంలో భాగంగానే నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయడం లేదని చెప్పారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అమ్మివేస్తున్నారని దీని కారణంగానే నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే దిశగా ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి.రజిని పాల్గొన్నారు.

కేంద్ర విధానాలకు నిరసనగా ప్రచారం

తోట్లవల్లూరు: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం మండల పార్టీ కార్యదర్శి శీలం ప్రకాశరావు డిమాండ్ చేశారు. కేంద్ర విధానాలను నిరసిస్తూ మండలంలోని బొడ్డపాడు, చినపులిపాక గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కరపత్ర ప్రచారం చేపట్టారు. నిరుద్యోగం, అధిక ధరలు, విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేంద్ర విధానాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎంపీటీసీ జుజ్జవరపు ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

మగ్గం సామగ్రి అందజేత



మహిళలకు మగ్గం పనిముట్లు అందజేస్తున్న చిన్నమస్తాన్

గన్నవరం: పేదల అభ్యున్నతికి నూర్‌బాషాలు, దూదేకుల ముస్లిం మైనార్టీల సంక్షేమ సంఘం తోడ్పాటు అందిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పులమర్తి చిన్నమస్తాన్ పేర్కొన్నారు. మండలంలోని దావాజిగూడెంలో సంఘ కార్యాలయంలో ఆదివారం పలువురు పేద మహిళలకు చీరలు, మగ్గం వర్క్ శిక్షణ పొందుతున్న మహిళలకు పనిముట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలు సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పులిమర్తి మాట్లాడుతూ..తమ సంఘం ద్వారా నూర్‌బాషాలు, దూదేకుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. పేద వర్గాలకు చెందిన మహిళలకు, విద్యార్థులకు తమవంతు సాయం అందిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో తమ సేవలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి హుస్సేన్, నియోజకవర్గ అధ్యక్షులు డి.రాజిరసూల్, ప్రధాన కార్యదర్శి రహంతుల్లా పాల్గొన్నారు.